సాక్షి
నాగర్‌కర్నూల్
సోమవారం । 28 । ఆగస్టు । 2023



**ఎన్నాళ్లీ ఎదురుచూపులు**
ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టాలకు హద్దులు చూపాలని లబ్ధిదారులు కోరుతున్నారు.
వివరాలు 8లో ▸



**ముగిసిన మహాయాగం**
జడ్చర్లలో 14 రోజులుగా నిర్వహించిన విశ్వ శాంతి మహాయాగం ఆదివారం ముగిసింది.
వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.0 /23.0
**వాతావరణం**
రోజంతా ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### 15న ఉద్యోగ నియామక ర్యాలీ

కందనూలు: సికింద్రాబాద్‌లోని ఏయిర్ ఫోర్స్ స్టేషన్‌లో వాయుసేన ఉద్యోగ నియామక ర్యాలీని వచ్చే నెల 15న నిర్వహించనున్నట్లు వింగ్ కమాండర్, రిక్రూట్‌మెంట్ ఆఫీసర్ హుర్‌ప్రిత్ అత్వాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వాయు సేనలో ఉద్యోగం పొందాలనుకునే నిరుద్యోగ యువతకు ఇది ఒక సువర్ణ అవకాశమని, కేవలం దక్షిణ భారతదేశానికి మాత్రమే ఈ ఓపెన్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అగ్నివీర్, వాయు కింద ఈ నియామకాలు ఉంటాయని తెలిపారు. వచ్చే నెల 15న సికింద్రాబాద్, బేగంపేటలోని 12 ఏయిర్ మెన్ సెలక్షన్ సెంటర్, ఏయిర్ ఫోర్స్ స్టేషన్‌లో జరిగే ఓపెన్ ర్యాలీ నియామకాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అభ్యర్థులు మాత్రమే హాజరుకావాలని వివరించారు. జిల్లాలో ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు http://afnipathvayu.cdac.in/AV/నోటిఫికేషన్ లింక్‌లో చూడాలని తెలియజేశారు.

### మహిళా డిగ్రీ కళాశాలలో దరఖాస్తుల స్వీకరణ

కందనూలు: ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థినిలు నాగర్‌కర్నూల్ మహిళా డిగ్రీ కళాశాలలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సుజాత ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. బీఎస్సీ (ఎంపీసీ, ఎంఎస్సీ, ఎంబీజెడ్సీ) కోర్సుల్లో మొదటి సంవత్సరంలో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేస్తామన్నారు. ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 79956 60881 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

### భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి 108 రకాల నైవేద్యాలను సమర్పించారు. అమ్మవారికి అభిషేక పూజలు నిర్వహించి వడిబియ్యం పోశారు. అధికసంఖ్యలో మహిళలు హాజరయ్యారు.

### కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా జనార్దన్‌రెడ్డి



కల్వకుర్తి: నాగర్‌కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ముచ్చర్లపల్లి జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యాదయ్యగౌడ్ ఎంపికయ్యారు. ఆదివారం కల్వకుర్తి మండలం మార్చాలలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి జగదీష్‌యాదవ్ హాజరయ్యారు. ఆయన సమక్షంలో ఏకగ్రీవం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడారు. జిల్లాలో కబడ్డీ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇవ్వడంతో పాటు పోటీలు నిర్వహిస్తామని అన్నారు. నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నర్సింగ్‌రావు, శ్రీరాములు, ఇంటర్నేషనల్ క్రీడాకారుడు మహేందర్‌రెడ్డి, అనిల్ కుమార్, చంద్రమోహన్, రవికుమార్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

# ఎన్నికల వేడ్డీ!

## ‘పాలమూరు’లో హీటెక్కిన రాజకీయాలు

- బీఆర్‌ఎస్‌లో రాజుకుంటున్న టికెట్ల కుంపటి
- కల్వకుర్తి నియోజకవర్గంలో అసంతృప్తి జ్వాలలు
- కాంగ్రెస్‌లో తారస్థాయికి అంతర్గత పోరు
- ఆ 4 సెగ్మెంట్లలో నువ్వా.. నేనా అన్నట్లు వార్



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఎన్నికలకు ఇంకా మూడు నెలల సమయం ఉండగా.. ఉమ్మడి పాలమూరులో అప్పుడే వేడి రాజుకుంది. అధికార బీఆర్‌ఎస్‌లో అసెంబ్లీ అభ్యర్థులు ఖరారు కాగా.. ఒకటి, రెండు నియోజకవర్గాల్లో అంతర్గత పోరుతో అసంతృప్తి జ్వాలలు ఎగసిపడుతున్నాయి. కాంగ్రెస్‌లో టికెట్లకు దరఖాస్తు ప్రక్రియ ముగియగా.. ఇంకా ఖరారు కాలేదు. అయినప్పటికీ ఆ పార్టీలో పలు సెగ్మెంట్లలో నువ్వా.. నేనా అన్నట్లు అభ్యర్థిత్వాల లొల్లి తారస్థాయిలో కొనసాగుతోంది. మరోవైపు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు తీర్పు వెల్లడించిన నేపథ్యంలో నడిగడ్డలో రాజకీయాలు మరింత హీటెక్కాయి. డీకే వర్సెస్ బండ్ల వర్గీయుల మధ్య ఢీ అంటే ఢీ అనేలా మాటల యుద్ధం నడుస్తోంది. ఇలా మారుతున్న రాజకీయ పరిణామాలు ఎటువైపు దారి తీస్తాయోననే ఆందోళన ఆయా పార్టీల అధిష్టానాలను కలవరపెడుతుండగా.. శ్రేణుల్లో ఆందోళన నెలకొంది.

**కల్వకుర్తిలో అసమ్మతి సెగలు..**

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. బీఆర్‌ఎస్‌కు సంబంధించి అన్ని స్థానాల్లోనూ సిట్టింగ్ ఎమ్మెల్యేలను అభ్యర్థులుగా ప్రకటిస్తూ ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఈ నెల 21న జాబితా విడుదల చేశారు. అయితే ఆ రోజే అలంపూర్‌కు సంబంధించి అభ్యర్థిని మార్చాలని కోరుతూ క్యాతూర్ సింగిల్ విండో చైర్మన్ రాఘవరెడ్డి లేఖ రాశారు. ఆ తర్వాత నిన్న, మొన్నటి వరకు ఆ నియోజకవర్గంతోపాటు మిగతా సెగ్మెంట్లలో వాతావరణం అంతా స్తబ్దుగానే ఉంది. కానీ.. కల్వకుర్తిలో ఒక్కసారిగా అసమ్మతి సెగలు భగ్గుమంటున్నాయి. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అభ్యర్థిత్వాన్ని మార్చాలని డిమాండ్ చేస్తూ శనివారం మాడ్గులలో, ఆదివారం కడ్తాల్‌లో నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ అసమ్మతి నాయకులు సమావేశాలు ఏర్పాటు చేయడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ‘ప్రజలు ఎవరు కోరుకుంటే వాళ్లు ఎమ్మెల్యే అయితరు.. ప్రజలు కోరుకోని వారిని బలవంతంగా రుద్దితే ఉద్యమం వస్తుంది.. ఎవరిని సంప్రదించకుండా ఏకపక్షంగా టికెట్ ఖరారు చేశారు.. ప్రజల అభిమానం కోల్పోయిన నాయకులు గెలవలేరు. కల్వకుర్తి ప్రజల ఆకాంక్షను పరిగణలోకి తీసుకోవాలి. ఎమ్మెల్యే అభ్యర్థిత్వంపై పార్టీ అధిష్టానం పునరాలోచన చేయాలి’ అని బాలాజీసింగ్ అసమ్మతి నేతల సమావేశంలో విలేకరులతో మాట్లాడడం హాట్‌టాపిక్‌గా మారింది. నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉండగా.. రోజుకో మండలంలో అసమ్మతి నాయకులు సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

**గద్వాలలో మాటల యుద్ధం..**

బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, డీకే అరుణ పోటాపోటీగా విమర్శలు చేసుకున్నారు. వారి వారి కుటుంబ సభ్యులు సైతం విలేకరుల సమావేశాలు నిర్వహించి దుమ్మెత్తి పోసుకోవడం గద్వాలలో హాట్‌టాపిక్‌గా మారింది. బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి భార్య జ్యోతి ఇలా వేధించడం కన్నా విషమిచ్చి చంపాలని అనగా.. మరుసటి రోజు డీకే అరుణ కుమార్తె స్నిగ్ధారెడ్డి మాట్లాడుతూ ఈ మొసలి కన్నీరు ఇంకెంత కాలం.. కన్న కొడుకులా ఆదరిస్తే వెన్నుపోటు పొడిచిన వ్యక్తి కృష్ణమోహన్‌రెడ్డి అంటూ ధీటుగా సమాధానమివ్వడం చర్చనీయాంశంగా మారింది.

**స్తబ్ధతపై బీజేపీ శ్రేణుల్లో ఆందోళన..**

బీఆర్‌ఎస్‌లో అభ్యర్థుల ఖరారు తర్వాత అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు, ఆత్మీయ సమ్మేళనాలతో ఆయా నేతలు నిత్యం ప్రజాక్షేత్రంలోనే ఉంటూ ప్రచారం మొదలుపెట్టారు. కాంగ్రెస్‌లో టికెట్ల ఖరారు ప్రక్రియ కొనసాగుతుండగా.. పోటీపడుతున్న ఆశావహులు తమ తమ అనుచరులు, కార్యకర్తలతో నియోజకవర్గాల్లో సందడి చేస్తున్నారు. తిరగబడదాం.. తరిమికొడదాం కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారు. అయితే బీజేపీలో అభ్యర్థిత్వాల ఖరారుపై ఎలాంటి సన్నాహకాలు ప్రారంభం కాకపోవడంతో పార్టీ కార్యకర్తల్లో నిరుత్సాహం అలుముకుంది. ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో భాగంగా పార్టీకి చెందిన ఇతర రాష్ట్రాల నేతలు ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకోవడంతోపాటు కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇదీ తూతూమంత్రంగానే జరుగుతుండగా.. ఎన్నికల వేడి రాజుకున్న క్రమంలో పార్టీలో స్తబ్దత నెలకొనడంపై కమలం శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

**కాంగ్రెస్‌లో కిరికిరి..**

హస్తం పార్టీలో ప్రధానంగా నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి, గద్వాల నియోజకవర్గాల్లో టికెట్ల కిరికిరి నడుస్తోంది. ఈ స్థానాల్లో ముఖ్య నాయకుల చేరికలు చిచ్చు రేపాయి. నాగర్‌కర్నూల్‌లో సీనియర్ నేత నాగం జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తనయుడు రాజేష్‌రెడ్డి.. గద్వాలలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డితోపాటు రాజీవ్‌రెడ్డి, కుర్వ విజయ్‌కుమార్ మధ్య టికెట్ల పోరు తారస్థాయికి చేరినట్లు తెలుస్తోంది. వనపర్తిలో సీనియర్ నేత, మాజీమంత్రి చిన్నారెడ్డి, కాంగ్రెస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి మధ్య ఇదివరకే టికెట్ల వార్ నడుస్తుండగా.. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మేఘారెడ్డి సైతం పోటీ పడుతుండడం ఆసక్తికరంగా మారింది. కొల్లాపూర్ నియోజకవర్గంలో టీపీసీసీ నాయకుడు జగదీశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు మధ్య టికెట్ల లొల్లి తీవ్రరూపం దాల్చింది. తాను బరిలోకి దిగడం ఖాయమని.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈసారి ఊరుకునేది లేదని జగదీశ్వర్‌రావు తేల్చి చెబుతున్నారు. మరోవైపు కాంగ్రెస్‌కు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అభిలాష్‌రావు రాజీనామా చేయడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. జూపల్లి కాంగ్రెస్‌లో చేరుతున్న సమయంలో ఆహ్వానించిన ఆయన.. కొన్నిరోజుల తర్వాత ప్లేట్ ఫిరాయించడం విశేషం. జూపల్లి ఆధిపత్య ధోరణితో తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని రాజీనామా చేసిన ఆయన త్వరలో బీఆర్‌ఎస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు ఎవరికి చేటు చేస్తాయోననే చర్చ హస్తం శ్రేణుల్లో జోరుగా సాగుతోంది.

### కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చీకట్లే..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తెలకపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. చీకట్లు కమ్ముకుంటాయని ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం రెండో రోజు ‘పది ఏళ్ల ప్రజాప్రస్థానంలో మర్రన్న పాదయాత్ర’ అనే కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని రాకొండ నుంచి పాదయాత్ర ప్రారంభించారు. లక్నారం, గోలగుండ, జంగమోనిపల్లి, బొప్పల్లి, ఆలేరు గ్రామాల్లో మొత్తం 15 కి.మీ.లు ఎమ్మెల్యే పాదయాత్ర చేపట్టారు. ఆయా గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. జంగమోనిపల్లిలో పంటపొలాల్లో మహిళా కూలీలతో కలిసి వరినాట్లు వేశారు. నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానన్నారు. ఇంకా నియోజకవర్గంలో చేయాల్సిన పనులు ఆయా గ్రామాల్లో తెలుసుకుంటున్నానని అన్నారు. లక్నారం, జంగమోనిపల్లి, గోలగుండం, బొప్పలి, ఆలేరు గ్రామాల్లో 15 కి.మీ.ల మేర పాదయాత్ర చేపట్టామని చెప్పారు. ఆయా గ్రామాల్లో మహిళలు బోనాలు, బతుకమ్మలు, పీర్లతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కేసీఆర్ సీఎం అయ్యాక అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గ్రామాల్లో పెద్దఎత్తున సీసీరోడ్లు, విద్యుత్ దీపాలు, డ్రెయినేజీలను ఏర్పాటు చేసి అభివృద్ధి చేశామన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రూ.4 వేల పింఛన్ అమలుచేసి తెలంగాణ ప్రజలకు చూపించాలని అన్నారు. ఎంజేఆర్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ.. ఆదుకుంటున్నామన్నారు. 15 ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని ఆ పాఠశాలలో అన్ని మౌలిక వసుతులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బైకాని శ్రీనివాస్‌యాదవ్, జెక్క రఘునందన్ రెడ్డి, హనుమంతురావు, కొమ్ముమధు, ఈదుల నరేందర్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# జలపుష్పాలు సిద్ధం

- జిల్లాలో ఈ ఏడాది 2.50 కోట్ల చేపపిల్లలు వదిలేందుకు ప్రణాళిక
- శ్రీకారం చుట్టిన మత్స్యశాఖ
- విడతల వారీగా విడుదల కొనసాగుతుందని అధికారుల వెల్లడి



జిల్లాలోని రిజర్వాయర్లు **5**
చెరువులు, కుంటలు **1,260**
మత్స్యకార సహకార సంఘాలు **167**
సహకార సంఘాల్లో సభ్యుల సంఖ్య **14,163**

కొల్లాపూర్: జల వనరుల్లోకి చేప పిల్లలను వదిలే ప్రక్రియ ప్రారంభమైంది. ప్రతి ఏడాది ఆగస్టు మాసంలో చెరువులు, కుంటల్లోకి మత్స్యశాఖ అధికారులు చేపపిల్లలను వదులుతుంటారు. ఈ నెలాఖరు వరకు చేపపి ల్లల విడుదలను దాదాపుగా పూర్తి చేసేవారు. ఈ సారి వర్షాలు సకాలంలో కురవకపోవడంతో చేపపిల్లల విడుదల కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభమైంది. శనివారం జిల్లాలోని తెలకపల్లి మండలం గౌరారం చెరువులో చేపపిల్లలు నీటిలో వదిలే కార్యక్రమాన్ని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు.

**నాలుగు రకాలు..**

మత్స్యశాఖ అధికారులు నీటిలో వదిలే చేపపిల్లలు ప్రధానంగా నాలుగు రకాలు ఉన్నాయి. బొచ్చ, రవుట, బంగారుతీగ, బీగాల రకం చేపపిల్లల కోసం మత్స్యశాఖ టెండర్లు నిర్వహించింది. 2.40 కోట్ల చేపపిల్లలను టెండర్లు దక్కించుకున్న కంపెనీలు సప్లయ్ చేస్తాయి. మరో పది లక్షల చేపపిల్లలను మత్స్యశాఖ ఆధ్వర్యంలో చంద్రసాగర్ రిజర్వాయర్‌లో ఉత్పత్తి చేశారు. వీటిని మత్స్యసహకార సంఘాలకు అప్పగించి, వారి ద్వారా నేరుగా చెరువుల్లోకి వదులుతారు.

**ఆలస్యంగా కృష్ణానదిలోకి..**

వర్షాలు ఆలస్యంగా కురవడంతో చేపపిల్లల విడుదల కూడా ఈసారి కొంత ఆలస్యమైంది. చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు నిండాక చేపపిల్లలను వదలాల్సి ఉంటుంది. అయితే వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోయినప్పటికీ, కేఎల్‌ఐ ప్రాజెక్టు నీటి ఎత్తిపోతల కారణంగా రిజర్వాయర్లతో పాటు చెరువులు, కుంటలను నింపారు. దీంతో చెరువులు, కుంటల్లో చేపపిల్లలు వదిలే కార్యక్రమం చేపట్టారు. కృష్ణా నదిలో మాత్రం నీళ్ల ఫుల్‌గేజ్‌కు తక్కువగా ఉండటంతో చేపపిల్లలు వదిలేందుకు మరికొంత సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు.

**నెలన్నరలో పూర్తిచేస్తాం..**



జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటల్లో చేప పిల్లల విడుదల కార్యక్రమం ప్రారంభించాం. చేపపిల్లల విడుదల పూర్తిచేయడానికి నెలన్నర సమయం పట్టొచ్చు. కృష్ణానదిలో నీటిమట్టం తక్కువగా ఉన్నందున నదిలో ఇప్పుడే చేపపిల్లలు వదలం. కొంత మేరకు నీటిమట్టం పెరిగాక వదిలిపెడతాం. 2.50 కోట్ల చేపపిల్లలను నీటి వనరుల్లో వదలిపెట్టాలని లక్ష్యంగా నిర్ణయించాం.

– లక్ష్మప్ప, జిల్లా మత్స్యశాఖ అధికారి

**వాడకుండా చూడాలి**



మత్స్యకారుల జీవనోపాధి అవకాశాలను పెంపొందించేందుకు మత్స్యశాఖ అధికారులు నీటి వనరుల్లో చేపపిల్లలను వదిలిపెట్టడం మంచి కార్యక్రమం. చెరువులు, కుంటల ద్వారా మత్స్యకారులు అన్ని రకాలుగా లబ్ధి పొందుతున్నారు. కానీ నదుల్లో వదిలే చేపపిల్లలను మాత్రం అలివి వలల ద్వారా వెంటనే పట్టేస్తున్నారు. అలివిని నిరోధిస్తే స్థానిక మత్స్యకారుల జీవనోపాధి మెరుగవుతుంది. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి.

– దబ్బ రాముడు, మత్స్యకారుడు, మంచాలకట్ట

**రిజర్వాయర్లలో..**

జిల్లాలోని కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాలను అనుసంధానించుకుని కృష్ణానది ప్రవహిస్తుంటుంది. కేఎల్‌ఐ ప్రాజెక్టు కింద 4 రిజర్వాయర్లు, అచ్చంపేట నియోజకవర్గంలోని చంద్రసాగర్ రిజర్వాయర్ ఉంది. వీటితో జిల్లా వ్యాప్తంగా 134 పెద్ద చెరువులు, 1,126 చిన్న చెరువులు ఉన్నాయి. మత్స్యకారుల జీవనోపాధి కోసం వీటిలో ప్రభుత్వం ప్రతిఏడాది చేపపిల్లలను వదిలిపెడుతుంటుంది. ఈ ఏడాది 2.50 కోట్ల చేపపిల్లలను వదలాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.



### గద్దర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి



గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కవులు, కళాకారులు

**ప్రముఖ రచయిత హిమజ్వాల**

కందనూలు: ప్రజాగాయకుడు గద్దర్ అమరజీవని, ఆయన పాట, మాట, యాది మరువలేనిదని ప్రముఖ రచయిత హిమజ్వాల అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సింగిల్‌విండో సమావేశ మందిరంలో నెలపొడుపు సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో గద్దర్ యాదిలో సంస్మరణ సభను కవి ఎదిరెపల్లి కాశన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా నౌక గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం గద్దర్ పాటలు, మాటలతో సభ జనరంజకంగా ఆయన జ్ఞాపకాలతో పాటలు పాడారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా వచ్చిన రచయిత హిమజ్వాల మాట్లాడారు. ప్రజల కోసం సమాజంలోని పరికరాలను ఆయుధాలుగా తయారు చేసుకునేలా తన పాటల ద్వారా యుద్ధానికి సిద్ధమయ్యేలా చైతన్యం చేసిన గొప్ప ప్రజాకవి, గాయకుడు గద్దర్ అని కొనియాడారు. గద్దర్ జీవితమంతా జనం కోసం పరితపించిన గొప్ప మహనీయుడని చెప్పారు. ఆయన స్ఫూర్తితో సమాజంలో అట్టడుగు వర్గాల మార్పుకోసం కవులు, రచయితలు, అభిమానులు, నాయకులు కృషి చేయాలని కోరారు. అంతే కాకుండా ప్రజల గద్దర్ ఆశయ సాధన కోసం మనం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెట్టిధర్మరాజు, వనపట్ల సుబ్బయ్య, కందికొండ మోహన్, వహీద్ ఖాన్, కల్వకోల్ మద్దిలేటి, ఆనంద్ జీ, ఆర్ శ్రీనివాసులు, ముచ్చర్ల దినకర్, జక్కాగోపాల్ తదితరులు, పాల్గొన్నారు.

### కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ కమిటీ ఎన్నిక



తెలంగాణ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ కమిటీ సభ్యులు

కందనూలు: తెలంగాణ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ కమిటీని ఆదివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీమైదానంలో జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుల కృష్ణారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, నారాయణపేట జిల్లా గౌరవ అధ్యక్షుడు నారాయణ ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రమేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాజవర్ధన్ రెడ్డి, కోశాధికారిగా మురళి చారి, వర్కింగ్ ప్రసిడెంట్ రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా కవిత, నాజ్యానాయక్, సుధాకర్, లక్ష్మణ్‌గౌడ్, శ్యామ్‌గౌడ్, మీడియా సమన్వయకర్త పాషా, సంయుక్త కార్యదర్శులు సందీప్, ఉపేందర్ రెడ్డి, శివలింగం, అశోక్, ముఖ్య సలహాదారులు శ్రీను, జైపాల్ నాయక్, రాఘవేందర్, కళ్యాణి, స్వామి, కార్యవర్గ సభ్యులుగా శోభ, విజయ, శ్రీనివాస్, కుమార్ కురుమయ్య, తిరుపతి, ఆంజనేయులు, ప్రకాష్, అంజి తిమోతి, రామస్వామి, పెంటయ్య తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రమేష్ రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి సమగ్ర శిక్షలో పనిచేస్తున్న మాకు ఉద్యోగాలను పర్మినెంట్ చేయడంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి, సమాన వేతనం ఇవ్వాలని కోరారు. మహిళలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, హెల్త్‌కార్డులు ఇవ్వడంతో పాటు, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి పరిహారం రూ.20 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు.

### అక్కమహాదేవి గుహల అభివృద్ధికి కృషి

స్టేషన్ మహబూబ్‌నగర్: కర్ణాటక, మహారాష్ట్ర భక్తులతోపాటు లింగాయత్‌లకు ఎంతో పవిత్రమైన అక్క మహాదేవి ఆలయం గుహల వద్ద పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లాకేంద్రం బోయపల్లి రోడ్డులోని తువ్వగుట్ట వద్ద ఉన్న బసవేశ్వర భవన్‌లో ఏర్పాటు చేసిన బసవేశ్వరుడి కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అక్కమహాదేవి పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించి మాట్లాడారు. పర్యాటకశాఖ నిధులతో కృష్ణానదిని అనుసరించి ఉన్న అక్కమహాదేవి గుహల వద్ద మెట్లు, పర్యాటకుల కోసం బోటు సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో కృష్ణానది, నల్లమల అటవీ ప్రాంతంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పర్యాటకులను ఆకట్టుకుంటామన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాతే రాష్ట్రంలో అధికారికంగా బసవేశ్వరుని జయంతి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీరశైవ లింగాయత్‌లను ఓబీసీలో చేర్చడానికి బీఆర్‌ఎస్ ఎంపీ బీబీ పాటిల్ ఆధ్వర్యంలో ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద పాటిల్, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేష్, జేపీఎన్‌సీ చైర్మన్ రవికుమార్, నాయకులు శివకుమార్, గోపాల్‌యాదవ్, నర్సింహులు, మోతీలాల్, శివుడు, శంకర్‌లింగం, రాజసింహుడు, వజ్రలింగం, సిద్ధిరామప్ప, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. అలాగే క్రిస్టియన్‌పల్లి డబుల్‌బెడ్‌రూం కాలనీ వద్ద 500 గజాల్లో రూ.10 లక్షలతో చేపట్టిన స్వరలహరి కల్చరల్ అకాడమీ భవన నిర్మాణానికి మంత్రి ఆదివారం భూమిపూజ చేశారు. స్వరలహరి కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు భాగన్నగౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

### పాలమూరు రెడ్డిసేవా సమితి ఉమ్మడి జిల్లా కార్యవర్గం

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం మహబూబ్‌నగర్‌లో ఆదివారం బాధ్యతలు చేపట్టింది. నూతన కార్యవర్గం చేత పాలమూరు రెడ్డి సేవా సమితి గౌరవ సలహాదారు మనోహర్‌రెడ్డి పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా తూము ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వి.రాజేందర్‌రెడ్డి, కోశాధికారిగా మల్లు నర్సింహారెడ్డి, సహాధ్యక్షుడిగా పి.ధనంజయరెడ్డి, ఉపాధ్యక్షులుగా జి.వెంకట్రామరెడ్డి, అశోక్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ఉదయశ్రీ ఎన్నికయ్యారు.

## క్లుప్తంగా

### ఒకే గ్రామంలో ఇద్దరి బలవన్మరణం

**బిజినేపల్లి:** మండలంలోని పోలెపల్లికి చెందిన గణేష్ (23) ఆదివారం తెల్లవారుజామున ఇంటి వద్ద వరండాలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి ఇంట్లో నుంచి వరండాలో కూర్చున్న గణేష్‌ను కుటుంబ సభ్యులు గమనించి ఎందుకు బయట కూర్చున్నావ్ అని ఆరా తీశారు. బదులుగా నిద్రరావడం లేదని యువకుడు సమాధానం ఇచ్చాడు. కానీ తెల్లవారుజామున కుటుంబ సభ్యులు లేచి చూసే సరికి ఉరేసుకున్నాడు.

**మరో ఘటన..**

ఇదే గ్రామానికి చెందిన ఓ యువతి ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే నాగర్‌కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి చికిత్స కోసం తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కడుపు నొప్పి కారణంగా ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై పోలీసుల వివరణ కోరగా వీటిపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

### విద్యార్థిని ఆత్మహత్య



స్వాతి (ఫైల్)

**కొత్తకోట రూరల్:** మండలంలోని మిరాసిపల్లికి చెందిన స్వాతి(15) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్ మండలం మోట్లంపల్లికి చెందిన మహేష్(19), స్వాతి ప్రేమించుకున్నారు. ఈ క్రమంలో స్వాతి కుటుంబ సభ్యులు మహేష్‌కు ఫోన్ చేసి స్వాతి చనిపోకముందే చనిపోయిందని, మా అమ్మాయి చావుకు నీవే కారణం నిన్ను, నీ కుటుంబ సభ్యులను చంపుతామని బెదిరించారు. దీంతో మహేష్ తన తండ్రికి విషయాన్ని చెప్పడంతో మాట్లాడుదాము నీవేమి బెంగపెట్టుకోవద్దని సర్దిచెప్పాడు. తీవ్ర మనస్తాపానికి గురైన మహేష్ శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మహేష్ ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని తెలుసుకున్న స్వాతి ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. స్వాతి తండ్రి కుర్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా స్వాతి స్థానిక జెడ్పీహెచ్‌లో 10వ తరగతి చదువుతున్న గ్రామస్తులు తెలిపారు.

### యువకుడిపై పాక్సో కేసు నమోదు

**మహబూబ్‌నగర్ క్రైం:** అభం.. శుభం తెలియని ఓ చిన్నారితో ఓ యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయం బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో యువకుడి ఇంటిపై దాడి చేసి పోలీసులకు సమాచారం అందించారు. వివరాల్లోకి వెళితే మహబూబ్‌నగర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు శనివారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన 7ఏళ్ల బాలికకు చాక్లెట్లు ఇప్పిస్తానని చెప్పి మన్యంకొండ గుట్ట వైపు తీసుకెళ్లాడు. ఆ తర్వాత రోడ్డు పక్కనే ఆ బాలికతో యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించడంతో భయంతో కేకలు వేసింది. చుట్టు పక్కల వారు నిలదీయడంతో మళ్లీ ఆ బాలికను గ్రామంలో దించాడు. ఆ బాలిక ఏడుస్తూ ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు విషయం చెప్పింది. తల్లిదండ్రులతో పాటు బంధువులు కలిసి యువకుడితో పాటు ఇంటిపై దాడి చేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. దీనిపై బాధితురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో రూరల్ పోలీస్ స్టేషన్‌లో పాక్సో కేసు నమోదు చేసినట్లు సమాచారం.

### స్థల వివాదంలో నలుగురిపై..

**వీపనగండ్ల:** స్థల వివాదంలో నలుగురిపై కేసు నమోదైన ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవి ప్రకాష్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మానపాడు ముత్యాలు, మానపాడు బాలస్వామి, మానపాడు నర్సింహ, శిరీషలు వారి సమీప దాయాదుల పిల్లలైన మానపాడు జనార్దన్, మానపాడు తిరుపతయ్యలపై స్థల వివాదంలో దాడికి పాల్పడ్డారు. దీంతో గాయపడిన వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# ఎన్నాళ్లీ ఎదురుచూపులు?

## దుంపాయికుంటలో ఏడాదిగా కొనసాగుతున్న గుడిసెల పోరాటం



అమరచింతలోని దుంపాయికుంటలో గుడిసెలు వేసుకున్న లబ్ధిదారులు

- ఇంటి పట్టాలకు హద్దులు చూపాలంటూ ఆందోళన
- స్పందించని అధికార యంత్రాంగం

**అమరచింత:** ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టాలకు హద్దులు చూపాలంటూ అమరచింత దుంపాయికుంటలో లబ్ధిదారులు చేస్తున్న పోరాటం ఏడాదికి చేరుతున్నా.. సంబంధిత అధికారులు, పాలకవర్గం పట్టించుకోకపోవడంతో పేదలు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. 1997లో అప్పటి ప్రభుత్వం పట్టణంలోని దుంపాయికుంటలో సర్వే నంబర్ 586, 587లో 14 ఎకరాల భూమిని కొనుగోలు చేసి 350 మంది పైచిలుకు పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేసింది. పట్టాలు అందించిన అధికారులు హద్దులు చూపకపోవడం.. లబ్ధిదారులు స్థలాలు చూపాలంటూ వెంటపడినా పట్టించుకోకపోవడంతో సమస్య మరుగునపడింది. తమకు స్థలాలు చూపి న్యాయం చేయాలంటూ గతేడాది నుంచి లబ్ధిదారులు ఆందోళనకు సిద్ధమయ్యారు. వీరికి సీపీఎం మద్దతు ఇవ్వడంతో గతేడాది సెప్టెంబర్ తొమ్మిదో తేదీన దుంపాయికుంటలో గుడిసెలు వేసుకొని పోరాటం ప్రారంభించి నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు. చివరకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకంతోనైనా తమ సొంతింటి కల నెరవేరుతుందనుకుంటున్న పేదలు ప్రభుత్వం ఎలాంటి పరిష్కారం చూపుతుందోనని ఎదురుచూస్తున్నారు.

**కొనసాగుతున్న సర్వే..**

దుంపాయికుంటలో అప్పట్లో 280 మంది పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చిందని.. వాటి ఆధారంగా వివరాలు సేకరించి నిజమైన లబ్ధిదారులను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక అందించేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. పట్టాలు పొందిన వారి పరిస్థితులు ప్రస్తుతం ఎలా ఉన్నాయి.. సొంత ఇల్లు ఉందా లేదా అన్న విషయాలను పరిగణలోకి తీసుకుంటుండటంతో గుడిసెలు వేసుకున్న వారందరికి ఇంటి స్థలాలు ఇవ్వాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న కుటుంబం

### ఇల్లు లేక ఇబ్బందులు..



సొంత ఇల్లు లేక ఏళ్లుగా అద్దె ఇంటిలో ఉంటున్నాం. ఇంటి పట్టాలు ఇచ్చిన అధికారులు స్థలం చూపకపోవడంతో ఏడాదిగా ఇక్కడే గుడిసె వేసుకొని జీవిస్తున్నా. ఇప్పటికైనా స్పందించి స్థలం చూపించి ఇల్లు మంజూరు చేయాలి.

– గుండమ్మ, లబ్ధిదారు

### ఏడాదిగా ఇక్కడే..



ఏడాదిగా ఇక్కడే గుడిసె వేసుకొని కుటుంబం మొత్తం జీవిస్తున్నాం. సొంత ఇంటి స్థలం లేదు. ఉన్న ఇల్లు వర్షాలకు దెబ్బతింది. ఇచ్చిన ఇంటి పట్టా ప్రకారం స్థలం కేటాయించి గృహలక్ష్మి పథకంలో ఇల్లు మంజూరు చేయాలి.

– భాగ్యమ్మ, లబ్ధిదారు

### నివాస స్థలం లేక ఇబ్బంది..



నివాస స్థలం లేక అద్దె ఇంట్లో ఉంటూ కిరాయి చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ఇంటి స్థలం ఉన్నవారికి గృహలక్ష్మి పథకం అమలు చేస్తామని ప్రకటించింది. ఇచ్చిన పట్టా ప్రకారం తమకు ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలి.

– శాస్త్రి, లబ్ధిదారు

### వివరాలు సేకరిస్తున్నాం..



అప్పటి ప్రభుత్వం దుంపాయికుంటలో 280 మంది పేదలకు ఇంటి పట్టాలు కేటాయించింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రస్తుతం పట్టాదారుల వివరాలు ఇంటింటికి తిరిగి సేకరిస్తున్నాం. 22 ఏళ్ల కిందట పట్టా పొందిన వారు నేటికీ అద్దె ఇంట్లో నివసిస్తున్నారా లేదా సొంత ఇల్లు నిర్మించుకున్నారా? వారి కుటుంబంలో ఎవరికైనా ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయా? తదితర పూర్తి వివరాలు సేకరించి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తాం. అర్హులకే ఇంటి స్థలాలు ఇవ్వాలని సూచించడంతో సర్వే ప్రారంభించాం.

– చాంద్‌పాషా, తహసీల్దార్, అమరచింత

# రిజిస్ట్రేషన్ చేయడం లేదని వెంచర్‌లో నిరసన

- మూడురోజులుగా అక్కడే తిష్టవేసిన బాధితులు
- వంటావార్పు, రాత్రి అక్కడే బస



వెంచర్ వద్ద నిరసన తెలియజేస్తున్న బాధితులు

**వెల్దండ:** మండలంలోని కొట్ర సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన వెంచర్‌లో ప్లాట్లను కొనుగోలు చేసిన బాధితులు యజమానులు వాటిని వారికి రిజిస్ట్రేషన్ చేయటం లేదని నిరసన తెలియజేశారు. వెంచర్‌లో టెంట్ వేసుకొని 20 మంది బాధితులు అక్కడే మూడు రోజులుగా వంటావార్పు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొట్ర శివారులో కొట్ర చౌరస్తా నుంచి జేపీనగర్ వెళ్లే దారిలో 'అక్షర' వెంచర్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలోని సర్వే నంబర్లు 396, 397లలో డీటీసీపీ అనుమతులను పొందారు. ఇందుకు సంబంధించి వెంచర్‌ను పలువురు భాగస్వాములు కలిసి ఏర్పాటుచేసి, వారికి తోచినట్లుగా వాటిని అమ్మకాలు చేస్తూ వచ్చారు. చివరి నిమిషంలో ఓ భాగస్వామి డబ్బులను తన సొంత అవసరాలకు వాడుకోవటంతో సమస్య తలెత్తిందని బాధితులు చెబుతున్నారు. డబ్బులు పూర్తిగా కట్టినట్లుగా వారి వద్ద రశీదులు ఉన్నా, రిజిస్ట్రేషన్లు చేయమని అడిగితే కాలం వెల్లదీస్తూ రావటంతో విసిగిపోయి వెంచర్ వద్ద టెంట్ ఏర్పాటు చేసుకొని వంటావార్పు చేసుకుంటూ అక్కడే నిద్రాహారాలు చేస్తూ నిరసన తెలుపుతున్నారు. విషయాన్ని బయటకు పొక్కకుండా అందులోని కొందరు యజమానులు నచ్చజెప్పినా వినిపించుకోలేదు. చివరకు శనివారం డివిజన్ పరిధిలోని ఓ పోలీస్ అధికారి బాధితులలో ఒకరికి ఫోన్‌చేసి సమస్యను నేను పరిష్కరిస్తానని చెప్పటంతో బాధితులు నిరసనను విరమింపచేశారు. వచ్చేనెల 5వ తేదీలోపు సమస్యను పరిష్కరిస్తానని ఆ అధికారి హామీ ఇవ్వగా, సమస్య పరిష్కారం కాని పక్షంలో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని బాధితులు చెబుతున్నారు.

# జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

**ధరూరు:** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం ప్రాజెక్టుకు 3,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో 1,500 క్యూసెక్కులకు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో ఒక పంపు ద్వారా 750 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఆవిరి రూపంలో 111, భీమా లిఫ్టు –1 ద్వారా 650, కోయిల్ సాగర్‌కు 315, జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030, కుడి కాల్వకు 738, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50, సమాంతర కాల్వకు 700, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 4,294 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7.590 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

**శ్రీశైలంలో 855.2 అడుగుల నీటిమట్టం**

**దోమలపెంట:** శ్రీశైలం జలాశయంలో ఆదివారం 855.2 అడుగుల వద్ద 92.2 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 6వేలు, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 265, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,688, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 1.722 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 3,294 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు.

**రామన్‌పాడుకు 1,846 క్యూసెక్కుల నీరు**

**మదనాపురం:** మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం నాటికి ప్రాజెక్టులో 1,021 అడుగులకు నీటిమట్టం వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030, సమాంతర కాల్వ ద్వారా 816 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 1,250, కుడి, ఎడమ కాల్వ ద్వారా 65, రాజీవ్ భీమా ఫేజ్–2 ద్వారా 851 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.



జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

### కొనసాగుతున్న నీటి విడుదల

**దేవరకద్ర:** కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతుంది. ఈ నెల 1వ తేదీ నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటిని వానాకాలం పంటలకు వదులుతున్నారు. అలాగే జూరాల నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా ఒక మోటర్ ప్రారంభించి 315 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు వచ్చే నీటితో సమానంగా కాల్వల ద్వారా నీటిని విడుదల చేయడంతో నీటి మట్టం నిదానంగా పెరుగుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా ఆదివారం సాయంత్రం వరకు 27.6 అడుగులకు చేరింది. మరో 5 అడుగుల వరకు నీరు నిండితే పూర్తి స్థాయికి నీటి మట్టం చేరుకుంటుంది.

# గమ్యం చేరని బతుకులు

- బీచుపల్లి బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదం
- నిలిచిన వాహనాన్ని ఢీకొట్టిన కారు
- అక్కడికక్కడే ఇద్దరి మృతి

**ఎర్రవల్లిచౌరస్తా:** ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి కృష్ణానది బ్రిడ్జిపై ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. జాతీయ రహదారిపై వాహనం టైరు పంక్చర్ కావడంతో దాన్ని మారుస్తుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే ఇద్దరు దుర్మరణం చెందారు. ఎస్‌ఐ అశోక్ బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం హస్సన్ జిల్లాలోని గండసి గ్రామానికి చెందిన ముత్తురాజ్ (24) తన గూడ్స్ వాహనంలో అదే గ్రామానికి చెందిన సయ్యద్‌మాజ్ తో కలిసి అల్లంలోడుతో హైదరాబాద్‌కు శనివారం మధ్యాహ్నం బయలు దేరారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి కృష్ణానది బ్రిడ్జి వరకు రాగానే వెనకి టైరు పంక్చర్ కావడంతో ఇద్దరు కలిసి టైరును మారుస్తున్నారు. ఈ క్రమంలో కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అతివేగంతో వచ్చి వారి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. అక్కడికక్కడే వారి వాహనం కింద పడి మృతి చెందారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ జోతీష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. రెండు జీవితాలు గమ్యం చేరకుండానే ఇలా విగత జీవులుగా పడి ఉండటాన్ని చూసిన తోటి ప్రయాణికుల కళ్లలో కన్నీళ్లు ఆగలేదు.



ప్రమాదానికి కారణమైన కారు

# లారీ ఢీకొని బాలుడి దుర్మరణం

- తల్లిదండ్రులకు గాయాలు
- ఆందోళనకు దిగిన గ్రామస్తులు
- ఉండవెల్లి వద్ద లారీని పట్టుకున్న పోలీసులు

**గట్టు:** దైవ దర్శనం కోసం కుటుంబంతో కలిసి ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో రాయాపురం సమీపంలో లారీ రూపంలో బాలుడిని బలి తీసుకుంది. వివరాల్లోకి వెళితే.. బింగిదొడ్డితండాకు చెందిన వీరేష్‌నాయక్, లక్ష్మి దంపతుల కుమారుడు గౌతమ్ (6)తో పాటుగా ఏడేళ్ల బాలిక పరిణికతో కలిసి ద్విచక్ర వాహనంపై ఉరుకుంద వీరన్న స్వామి దర్శనం కోసం బయలుదేరారు. వీరు రాయాపురం దాటి గట్టు వైపు వస్తుండగా, రాయాపురం స్టేజీ వద్ద ఉన్న భారత్‌మాల రోడ్డు నిర్మాణం క్యాంపులో సిమెంట్ బస్తాలను దింపి గద్వాల వైపు వెళ్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో గౌతమ్ అక్కడిక్కడే మృతి చెందాడు. వీరేష్‌నాయక్, లక్ష్మి తీవ్రంగా గాయపడగా, పరిణిక స్వల్ప గాయాలతో బయటపడింది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ లారీని ఆపకుండా పరారయ్యాడు. చుట్టు పక్కల రైతులు విషయాన్ని గుర్తించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని గద్వాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నందికర్ పోలీస్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరకున్నారు. గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. పరిస్థితి చేయిదాటకుండా కేటిదొడ్డి ఎస్‌ఐ వెంకటేష్, మల్దకల్ ఎస్‌ఐ కల్యాణ్, అయిజ ఎస్‌ఐ నరేష్ రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్న ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఆందోళనకారులకు నచ్చ చెప్పారు. దీంతో గ్రామస్తులు శాంతించారు.

**ఉండవెల్లి వద్ద పట్టుబడ్డ లారీ..**

రాయాపురం వద్ద రోడ్డు ప్రమాదానికి కారణమైన లారీని హైదరాబాద్–కర్నూలు జాతీయ రహదారి ఉండవెల్లి వద్ద పట్టుకున్నట్లు ఎస్‌ఐ నందికర్ తెలిపారు. చుట్టుపక్కల పొలాల్లో పనులు చేసుకుంటున్న రైతులు ఇచ్చిన సమాచారం ఆధారంగా ప్రమాదానికి కారణమైన లారీ వివరాలను సేకరించి, జీపీఎస్ ఆధారంగా గద్వాల, ఎర్రవల్లి మీదుగా జాతీయ రహదారిపై వెళ్తున్న లారీని ఉండవెల్లి పోలీసుల సహకారంతో పట్టుకున్నారు.

### టీచర్‌ను బెదిరించి బంగారు గొలుసు అపహరణ

**కోడేరు:** మండలంలోని పస్పుల శివారులో ఓ టీచర్‌ను బెదిరించి మెడలోని బంగారు గొలుసును అపహరించిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకోగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన లలిత ఆరేళ్లుగా కోడేరు గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తుంది. రోజు వారిగా సాయంత్రం విధులు ముగించుకొని కోడేరు నుంచి నాగర్‌కర్నూల్‌కు వెళ్లేందుకు బస్టాండ్‌కు వెళ్లింది. అక్కడ బస్సు రాకపోవడంతో పస్పుల, పెద్దకొత్తపల్లి మీదుగా వెళ్లేందుకు కోడేరు శివారులో ఆగింది. అక్కడ గుర్తు తెలియని ఇద్దరు వచ్చి 'మేడం మీరు పెద్దకొత్తపల్లి పోవాలా' మేము కూడా అక్కడే వెళ్తున్నాము మా బైకుపై దింపుతామని చెప్పారు. దీంతో ఆ టీచర్ బైకుపై ఎక్కి వెళ్తుండగా పస్పుల దాటిన తర్వాత ఎవరూ లేని ప్రాంతంలో బైకును ఆపి టైరులో గాలి దిగుతుందని చెప్పి ఆమెపై దాడి చేసి మెడలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెల గొలుసు, చేతిలో ఉన్న బ్యాగును తీసుకొని పరారయ్యారు. బ్యాగులో సెల్‌ఫోన్, రూ.2వేల నగదు, రెండు జతల వెండి పట్టీలు ఉన్నాయని ఆమె తెలిపారు. ఈ విషయంపై అదే రాత్రి 100కు ఫోన్ చేయగా కోడేరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పగా ఆదివారం ఆమె ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై ఎస్‌ఐ శేఖర్‌రెడ్డిని వివరణ కోరగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

### రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ పోటీల్లో ప్రతిభ



**నర్సంపేట రూరల్:** వరంగల్ జిల్లా నర్సంపేట మండలం మహేశ్వరం శివారు శివానిపబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి 4వ సబ్ జూనియర్స్ బాలబాలికల పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటారు. బాలుర విభాగంలో ప్రథమ వనపర్తి, ద్వితీయ నాగర్‌కర్నూల్, బాలికల విభాగంలో వనపర్తి జట్టు ప్రథమ స్థానంలో నిలిచాయి. బాలికలు, బాలుర మిక్స్‌డ్ సెక్షన్‌లో వనపర్తి జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. విజేతలకు తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ రూల్స్ అండ్ రెగ్యులేషన్ కమిటీ కన్వీనర్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్, టార్గెట్ బాల్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుశ్యంత్‌రెడ్డి బహుమతులు అందజేశారు.

# వరుణుడు.. కరుణించాలని



వరుణుడి కరుణ కోసం గ్రామాల్లో రైతులు వివిధ రకాలుగా పూజలు నిర్వహిస్తున్నారు. వెల్దండ మండలం భర్కత్‌పల్లిలో ఆదివారం గ్రామస్తులు ఊరేగింపుగా భజనలు చేసుకుంటూ బైర్ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడే గుట్టపై వరద పాషం పోసి వర్షాలు కురిసి సాగుచేసిన పంటలు కాపాడాలని వేడుకుంటూ చేతితో తాకకుండా గొల్లకురుమలు, గ్రామస్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. నర్సింహ, గ్రామపెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

– వెల్దండ



# పురుగు మందులు – విష ప్రభావం లక్షణాలు



**పాడి-పంట**

**అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్**

**అలంపూర్:** పురుగు మందులోని విష తీవ్రతలలో తేడాలు ఉన్నప్పటికీ నిస్సందేహంగా అవి విష పదార్థాలని గ్రహించాలి. అవి తయారయ్యే కర్మాగారాలలో, నిల్వ ఉండే గిడ్డంగుల్లో, రైతు పైరుపై చల్లే సమయాల్లో సాధారణంగా పురుగు మందుల వల్ల ప్రమాదాలు కలిగే అవకాశం ఉంటుంది. వీటితో అతి జాగ్రత్తగా వ్యవహరించాలని ఏడీఏ సక్రియనాయక్ రైతులకు సూచిస్తున్నారు. జాగ్రత్తలు తీసుకున్న కొన్ని సందర్భాల్లో అనుకోని విధంగా పురుగు మందుల విష ప్రభావానికి లోనవుతున్నారు. అందుకు తగ్గ లక్షణాలను గుర్తించి ప్రథమ చికిత్స చేపట్టాలని జాగ్రత్తలు చెబుతున్నారు. పురుగు మందులు మానవ శరీరంలోకి మూడు విధాలుగా చేరడానికి అవకాశం ఉన్నట్లు ఏడీఏ వివరించారు.

**చర్మం ద్వారా**

శరీరంపై పురుగు మందు పడినప్పుడు చర్మం ద్వారా విషపదార్థం లోపలికి ప్రవేశిస్తుంది. శరీరంపై పుండ్లు, గాయాలు ఉన్నప్పుడు మరింత సులభంగా, త్వరగా ప్రవేశిస్తుంది.

**ముక్కు ద్వారా**

పురుగు మందు ద్వారా వెలువడే వాయువులు, ధూళి అణువులు గాలిని పీల్చడం వల్ల ముక్కు ద్వారా శరీరంలోకి విష పదార్థం ప్రవేశించి హాని కలిగిస్తుంది.

**నోటి ద్వారా**

పురుగు మందులను ముట్టుకున్నప్పుడు లేదా వాడిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోకపోవడం వల్ల, పురుగు మందులతో కలుషితమైన ఆహార పానియాలు తీసుకోవడం వల్ల, పురుగు మందుల అవశేషాలు, పరిమితికి మించి ఉండే ఆహార పదార్థాలు తినడం వల్ల తెలిసి, తెలియక పురుగు మందులు నోటి ద్వారా తీసుకోవడం వలన ఆరోగ్యానికి తీవ్ర హాని కలుగుతుంది. ఒక్కొక్కప్పుడు మరణం సంభవిస్తుంది.

**ప్రథమ చికిత్స**

చర్మం ద్వారా విష పదార్థం ప్రవేశించినప్పుడు వెంటనే నీటితో సబ్బు ఉపయోగించి కడుక్కోవాలి. కంటిలో పడినప్పుడు శుభ్రమైన నీటిని అధికంగా ఉపయోగించి కడుక్కోవాలి. చికిత్స కోసం వెంటనే వైద్యున్ని సంప్రదించాలి. బట్టలపై పడినప్పుడు వెంటనే తీసివేయాలి. వాటిని ఉతికి శుభ్రం చేసిన తర్వాతే ధరించాలి.

■ ముక్కుతో పీల్చినప్పుడు విష పదార్థం శరీరంలోకి ప్రవేశించినప్పుడు, విష ప్రభావానికి లోనైన వ్యక్తిని వెంటనే కలుషిత వాతవరణం నుంచి దూరం తీసుకెళ్లాలి. ధారాళంగా గాలి వచ్చే వాతవరణంలోకి మార్చాలి. దుస్తులు శరీరానికి అంటి పెట్టుకుని ఉన్నట్లయితే వదులు చేయాలి. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉన్నా లేక పూర్తిగా ఆగిపోయిన వెంటనే కృత్రిమ శ్వాస కల్పించాలి. ఆరోగ్యమైన వ్యక్తి ఎవరైనా తన నోటి ద్వారా అతని నోటిలోని గాలిని ఊది సులభంగాను, శక్తి వంతంగాను ఊపిరిపోయొచ్చు. విష ప్రభావానికి లోనైన వ్యక్తిని వీలైనంత త్వరగా చికిత్స కోసం వైద్యుని వద్దకు తీసుకెళ్లాలి.

■ నోటి ద్వారా విష పదార్థం తీసుకున్నప్పుడు వెంటనే వాంతి చేయించాలి. గ్లాసు వేడి నీళ్లలో స్పూన్ ఉప్పు లేక ఆవాల పొడి కలిపి తాగించాలి. గొంతులో వేళ్లు పెట్టి కక్కించాలి. కడుపులోని పదార్థం ఖాళీ అయ్యేటట్లు చూడాలి. 8 గ్రాముల చార్‌కోల్, 4 గ్రాముల ట్యానిక్ యాసిడ్, 4 గ్రాముల మెగ్నీషియం ఆక్సైడ్ రసాయనాలను అర గ్లాసు వేడి నీళ్లలో కలిపి తాగించాలి. పాలు, గుడ్డులోని తెల్లసొన, జలటీన్, లేపనం, ఇస్తే జీర్ణాశయం, లోపలి భాగానికి హాని కలగదు. వెంటనే వైద్యున్ని సంప్రదిస్తే జీర్ణాశయం, చిన్న ప్రేగులు వీలైనంత శుభ్రం అయ్యేలా చేస్తారు. అనంతరం చికిత్స అందిస్తారు.

## క్లుప్తంగా...

### డా.దేబల్ దేవ్‌కు ‘ఆర్గానిక్’ పురస్కారం



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దేశీ వరి వంగడాల పరిరక్షకుడు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ దేబల్ దేవ్‌కు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ‘ఐఫోమ్ ఆసియా ఆర్గానిక్ మెడల్ ఆఫ్ ఆనర్’ లభించింది. వంద దేశాల్లో సేంద్రియ వ్యవసాయదారుల సంఘాల సమాఖ్య (ఐఫోమ్) ఆర్గానిక్స్ ఆసియా విభాగం, చైనాలోని క్సిచాంగ్ కౌంటీ సంయుక్తంగా 2023వ సంవత్సరపు ఆర్గానిక్ మెడల్ ఆఫ్ ఆనర్ పురస్కారానికి డా. దేబల్ దేవ్‌ను ఎంపిక చేశాయి. వైవిధ్యభరితమైన 1,440కు పైగా అపురూపమైన భారతీయ వరి వంగడాలను సేకరించడంతో పాటు, ఒడిశాలోని తన చిన్న పరిశోధనా క్షేత్రంలో ప్రతి ఏటా సాగు చేస్తూ పరిరక్షిస్తున్న డా. దేబల్ దేవ్ దశాబ్దాలుగా నిస్వార్థ సేవ చేస్తున్నారు. అవార్డులోతోపాటు 5 వేల డాలర్ల నగదుతో పాటు ప్రశంసాపత్రం ప్రదానం చేస్తారు. ప్రకృతి సేద్యానికి అనువైన ఈ వంగడాల ద్వారానే మన ఆహార సార్వభౌమత్వం నిలుస్తుందని డా. దేబల్ దేవ్ ‘సాక్షి’తో అన్నారు.



గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో చేసిన విశేష సేవలకుగానూ డాక్టర్ దినకర్ రెడ్డికి హై9 హెల్త్ కేర్ కార్నివాల్ పురస్కారాన్ని అందచేస్తున్న మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ. హైదరాబాద్‌లో ఈ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది.

### చేవెళ్ల డిక్లరేషన్‌పై కాంగ్రెస్ సంబురాలు

సాక్షి, హైదరాబాద్: దళిత, గిరిజనుల అభ్యున్నతే లక్ష్యంగా శనివారం చేవెళ్ల సభలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటించినందుకు ఆదివాసి, దళిత కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం గాంధీభవన్‌లో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. సంప్రదాయ నృత్యాలు చేస్తూ సంబురాలను జరుపుకొన్నారు. అనంతరం ఆదివాసి కాంగ్రెస్ పార్టీ చైర్మన్ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ చేవెళ్లలో ప్రకటించిన డిక్లరేషన్.. రాష్ట్రంలో దళిత, ఆదివాసి, గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు.

# ‘హాకా’కు జాతీయ నోడల్ ఏజెన్సీ హోదా

**ఆంక్షలు లేకుండా దేశవ్యాప్తంగా వ్యాపారం చేసే వీలు**

- కేంద్రం తరపున ఆహార ఉత్పత్తుల కొనుగోలు
- తొలుత 50 వేల టన్నుల శనగలు కేటాయించిన కేంద్రం
- వీటిని పప్పుగా మార్చి వినియోగదారులకు అందించేలా చర్యలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ హైదరాబాద్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ అసోసియేషన్ (హాకా)కు అరుదైన గుర్తింపు లభించింది. జాతీయ స్థాయి నోడల్ ఏజెన్సీగా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో హాకా ఇకపై దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఎలాంటి ఆంక్షలు లేకుండా కేంద్ర ప్రభుత్వం తరపున వ్యాపారం చేయనుంది. ఈ హోదాతో దేశ వ్యాప్తంగా ఉన్న నాఫెడ్, నేషనల్ కో–ఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌సీసీఎఫ్) వంటి సంస్థల సరసన హాకా చేరింది.

**ఫలించిన మచ్చా కృషి**

హాకాకు జాతీయ స్థాయి నోడల్ ఎజెన్సీగా గుర్తింపు కోసం ఆ సంస్థ అధికారులు సుమారు ఆర్నెల్లుగా తీవ్ర ప్రయత్నాలు చేశారు. హాకా చైర్మన్ మచ్చా శ్రీనివాసరావు పలుమార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర కోఆపరేటివ్ అధికారులతో సమావేశమయ్యారు.



హాకా చైర్మన్ మచ్చా శ్రీనివాసరావు

హాకాను మరింత బలోపేతం చేసేందుకు గానూ దేశ వ్యాప్తంగా వ్యాపారం చేసే అవకాశం కల్పించాలని కోరారు. చిట్టచివరకు జాతీయ హోదా కల్పించింది. ప్రస్తుతం హాకా తెలంగాణలో రైతుల నుంచి పలు పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడంతో పాటు ఇతర ప్రభుత్వ సంస్థలకు ఆహార సరుకులను సరఫరా చేసే వ్యాపారం చేస్తోంది. అంగన్‌వాడీలకు పాలు పంపిణీ చేస్తోంది. వీటిని మరింత విస్తరించి దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించింది. ఇతర రాష్ట్రాల్లోనూ ప్రభుత్వ టెండర్లలో పాల్గొనేలా, ప్రభుత్వ సంస్థలకు సరుకులు సరఫరా చేసేలా చర్యలు చేపట్టింది. హాకాకు జాతీయ నోడల్ ఏజెన్సీ దక్కడంతో ఇకపై దేశంలో ఏ రాష్ట్రంలోనైనా ఆయా ప్రభుత్వాలు వేసే టెండర్లలో పాల్గొనే అవకాశం దక్కుతుంది. తద్వారా హాకా టర్నోవర్‌తో పాటు ఆదాయం కూడా పెరగనుంది. రాబోయే రోజుల్లో దాదాపు రూ.25 వేల కోట్ల టర్నోవర్ సాధించడమే లక్ష్యంగా హాకా లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

**తొలుత శనగల ప్రాజెక్టు...**

జాతీయ నోడల్ ఏజెన్సీ హోదాను దక్కించుకున్న హాకాకు కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా శనగల కొనుగోలు, పంపిణీ ప్రాజెక్టును ఇచ్చింది. దేశ వ్యాప్తంగా శనగపప్పు ధర అధికంగా ఉండడంతో ప్రభుత్వ పరంగా తక్కువ ధరకు వినియోగదారులకు అందించేలా కేంద్రం చేపట్టిన ‘భారత్ దాల్’ మిషన్‌లో భాగంగా హాకాకు శనగపప్పును సరఫరా చేసే బాధ్యతను అప్పగించింది. ప్రస్తుతం 50 వేల టన్నుల శనగలను కేటాయించింది. ఈ శనగలను వివిధ రాష్ట్రాల్లో కొనుగోలు చేసి, దాన్ని పప్పుగా మార్చాలి. ఆ పప్పును మార్కెట్లోకి విడుదల చేయాల్సిన బాధ్యత హాకాపై ఉంటుంది. అంతేకాకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే చౌక దుకాణాలకు కూడా హాకా సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ వ్యాపారం ద్వారా హాకాకు అదనంగా మరో రూ.150 కోట్ల టర్నోవర్ పెరగనుంది. తద్వారా హాకా టర్నోవర్ ఒకేసారి రెండింతలు కానుంది. ప్రస్తుతం హాకా రూ. 150 కోట్ల టర్నోవర్ కలిగి ఉంది. భవిష్యత్తులో అవసరమైతే ధాన్యం కొనుగోలు రంగంలోకి కూడా దిగాలని కూడా భావిస్తోంది.

**చైర్మన్‌కు అధికారి అడ్డంకులు...**

హాకా చైర్మన్‌గా మచ్చా శ్రీనివాసరావు వినూత్న చర్యలు చేపడుతున్నప్పటికీ, ఆయనకు వ్యవసాయశాఖలోని ఒక కీలకాధికారి అడ్డంకులు సృష్టిస్తున్నట్లు సమాచారం. దీంతో ఆయన ప్రభుత్వ పెద్దల వద్ద తన గోడును విన్నవించుకున్నారని తెలుస్తోంది. హాకాను ఎంతో అభివృద్ధి చేయాలని కృషి చేస్తుంటే కొంతమంది ఉద్దేశ్యపూర్వకంగా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారని తెలిసింది. కాగా ప్రభుత్వ పెద్దలతో సత్సంబంధాలు ఉండటంతో మచ్చా అన్ని అడ్డంకులు అధిగమిస్తూ హాకాకు జాతీయ హోదా తీసుకొచ్చారని సంస్థ అధికారులు చెబుతున్నారు.

# ప్రజల కోసం పనిచేసే పార్టీలను ఎన్నుకోండి

**సీఎం చంద్రశేఖరరావు**



సాక్షి, హైదరాబాద్: ప్రజల కోసం పనిచేసే పార్టీ, ప్రభుత్వాన్ని ఎన్నుకున్నప్పుడే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని భారత్ రాష్ట్ర సమితి అధినేత ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు అన్నారు. మహారాష్ట్ర బీజేపీ మైనార్టీ నేతలు పలువురు ఆదివారం ప్రగతిభవన్‌లో కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ వంటి సంఘసంస్కర్తలు, మేధావుల స్ఫూర్తితో దేశంలో సమూల మార్పు లక్ష్యంగా ప్రజలు చైతన్యవంతులై ఉద్యమించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీకి అధికారం ఇస్తున్నా జీవితాల్లో ఎలాంటి మార్పు రాకపోవడంపై ప్రజలు, యువత ఆలోచించాలన్నారు. సోలాపూర్ నుంచి వల్యాల నగేష్ నేతృత్వంలో ముస్లిం మైనార్టీ నేతలతో పాటు బీడ్ జిల్లా నుంచి పూల్‌చంద్ కరాడ్ ఆధ్వర్యంలో, మాజీ ఎమ్మెల్యే ముల్లర్ అంకోలా నుంచి, కొల్లాపూర్ నుంచి మహారాష్ట్ర కిసాన్ సెల్ ప్రెసిడెంట్ సంజయ్ పాటిల్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మహారాష్ట్ర బీఆర్ఎస్ ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధర్ రావు, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

# సర్వీసులో చనిపోతే రూ.7లక్షలు

- ఎంప్లాయ్ డిపాజిటెడ్ లింక్డ్ ఇన్సూరెన్స్ ఫెసిలిటీ అమలుకు ఆర్టీసీ నిర్ణయం
- ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు మరింత సాంత్వన
- గరిష్టంగా రూ.7 లక్షలు, కనిష్టంగా రూ.2.5 లక్షలు
- ఇప్పటికిప్పుడు 600 కుటుంబాలకు అందజేసే అవకాశం

సాక్షి, హైదరాబాద్: సర్వీసులో ఉంటూ చనిపోయే ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు సాంత్వన కలిగించే వార్త ఇది. భవిష్యనిధి(పీఎఫ్) ఆధారిత ‘ఎంప్లాయ్ డిపాజిటెడ్ లింక్డ్ ఇన్స్యూరెన్స్ ఫెసిలిటీ (ఈడీఎల్ఐఎఫ్)’ ని వర్తింప చేసేందుకు ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. ఈమేరకు తాజాగా సర్క్యులర్ జారీ చేసింది. సర్వీసులో ఉంటూ (ఈపీఎఫ్ సభ్యత్వం) చనిపోయే ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు గరిష్ఠంగా రూ.7 లక్షల వరకు ఆర్థిక సాయం అందుతుంది. ఇది ఉద్యోగి భవిష్య నిధికి చెల్లించే కాంట్రిబ్యూషన్‌తో సంబంధం లేకుండా, సంస్థ చెల్లించే మొత్తానికి అనుబంధంగా ఉండనుంది. దీంతో ఈ రూపంలో అందే మొత్తం ఉద్యోగి కుటుంబానికి అదనపు లబ్ధిగా ఉండనుంది.



**ఇది పాత పథకమే కానీ..**

వాస్తవానికి ఇది పాత పథకమే. భవిష్య నిధి నిబంధనల ప్రకారం ఈపీఎఫ్ సభ్యులందరికీ కచ్చితంగా అందాల్సిందే. గతంలో ఈ మొత్తం తక్కువగా ఉండేది. 2021లో కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ దీన్ని సవరించింది. కనిష్ట మొత్తాన్ని రూ.రెండున్నర లక్షలకు, గరిష్ట మొత్తాన్ని రూ.7 లక్షలకు పెంచింది. ఈ పెంపు 2020వ సంవత్సరం నుంచే వర్తిస్తుందని కూడా పేర్కొంది. కానీ, రకరకాల కారణాలతో ఇది ఆర్టీసీలో అమలు కాలేదు. ఏపీఎస్ఆర్టీసీకి, తెలంగాణ ఆర్టీసీకి గతంలో ఉమ్మడిగా పీఎఫ్ ట్రస్ట్ ఉండటం, ఇతర సాంకేతిక కారణాలతో ఈ సవరించిన లబ్ధి అందకుండా పోయింది. తాజాగా ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, ఈ లబ్ధిని అమలులోకి తేవాలంటూ కార్మిక సంఘాలు గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వంలో విలీనం కంటే ముందే దీన్ని వర్తింప చేయాలని, తదుపరి వచ్చే సాంకేతిక కారణాలతో కొన్ని రకాల లబ్ధికి గండి పడే ప్రమాదం ఉందన్న ఆందోళనతో దీన్ని ముందుగానే వర్తింప చేయాలని పట్టుపట్టాయి. ఈమేరకు ప్రభుత్వానికి విన్నవించాయి. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం ఆర్టీసీ సానుకూల నిర్ణయం తీసుకుంది.

**లెక్క ఎలా అంటే..**

నెలవారీ సగటు వేతనంపై ఈ మొత్తాన్ని లెక్కిస్తారు. గరిష్ఠ సగటు వేతనం రూ.15 వేలుగా నిర్ధారించి దానికి 35 రెట్ల మొత్తాన్ని గుణిస్తారు. ఆపై రూ.1.75 లక్షల మొత్తాన్ని బోనస్‌గా దీనికి చేర్చి రూ.7 లక్షల మొత్తాన్ని గరిష్ఠ మొత్తంగా నిర్ధారిస్తారు. ఇది ఆ ఉద్యోగి చనిపోయే సమయానికి పీఎఫ్ ఖాతాలో ఉన్న నిల్వ ఆధారంగా గుణిస్తారు.

**600 కుటుంబాలకు తక్షణ లబ్ధి..**

గతంలో ఈ పథకాన్ని వర్తిస్తూ మధ్యలో నిలిపి వేశారని కార్మిక సంఘాల నేతలు చెబుతున్నారు. అలా 600 మంది ఉద్యోగుల కుటుంబాలకు కొత్తగా లబ్ధి అందకుండా పోయిందన్నారు. ఇప్పుడు ఆర్టీసీ నిర్ణయంతో ఆ 600 కుటుంబాలకు వెంటనే లబ్ధి చేకూరుతుందని, తదుపరి ఈపీఎఫ్ సభ్యులు చనిపోతే వారి కుటుంబాలకు సాయం అందుతుందని టీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీఎస్‌రావు తెలిపారు.

# విమర్శలకు భయపడను

- దళితవాడలకు శ్రీవారిని తీసుకెళ్లి కళ్యాణం చేసింది.. మాడవీధుల్లో చెప్పులతో తిరగడాన్ని నిషేధించిందీ నేనే
- మతాంతీకరణలు ఆపడానికి 30 వేల మందికి కళ్యాణమస్తు ద్వారా సామూహిక వివాహాలు చేయించా
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

సాక్షి, తిరుపతి: దళితవాడలకు శ్రీ వేంకటేశ్వరస్వామిని తీసుకెళ్లి కళ్యాణం చేసింది.. తిరుమల ఆలయ మాడవీధుల్లో చెప్పులు వేసుకుని తిరగకూడదని నిర్ణయం తీసుకుంది తానేనని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి విమర్శకులకు గట్టిగా సమాధానమిచ్చారు. తాను క్రిస్టియన్ అని,



నాస్తికుడినని ఆరోపణలు చేస్తున్న వారికి ఇదే నా సమాధానమన్నారు. ఆరోపణలకు భయపడి మంచి పనులు చేయడం ఆపేవాడిని కాదని.. తాను పోరాటాల నుండి పైకొచ్చిన వాడినని, విమర్శలకు భయపడనని ఆయన స్పష్టంచేశారు. ఆదివారం తిరుపతిలో జరిగిన ‘మూడుతరాల మనిషి’ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయనతోపాటు ఈఓ ధర్మారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమన మాట్లాడుతూ.. తాను 17ఏళ్ల క్రితమే టీటీడీ చైర్మన్ అయిన వ్యక్తినని గుర్తుచేశారు. దేవుడి దయతో మతాంతీకరణలు ఆపడానికి 30 వేల మందికి కళ్యాణమస్తు ద్వారా సామూహిక వివాహాలు చేయించిన విషయాన్ని ఆయన వివరించారు. తిరుమల ఆలయ నాలుగు మాడవీధుల్లో చెప్పులు వేసుకుని తిరగకూడదనే నిర్ణయం కూడా తనదేనన్నారు. అన్నమయ్య 600వ వర్ధంతి ఉత్సవాలు చేసిన విషయాల గురించి తెలిపిందీ తానేనని ఆయన వెల్లడించారు.

**నాలుగేళ్ల అభివృద్ధిపై పీపీటీ ప్రదర్శన..**

తిరుమల శ్రీవారిపై ఉన్న భక్తివిశ్వాసాలను దెబ్బతీసేలా సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. టీటీడీ నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి, భక్తుల వసతుల కల్పనపై నెలరోజుల్లో పీపీటీ ప్రదర్శన ఏర్పాటుచేయనున్నట్లు ప్రకటించారు. టీటీడీ మీద విమర్శలు చేస్తున్న వారిలో తిరుపతి వాసులు కూడా ఉన్నారని తెలిపారు. టీటీడీని తిరుపతి వాసులు తమ సొంతంగా భావించాలని కోరారు. దేవుడి దయవల్లే తిరుపతిలో ప్రత్యక్షంగా పరోక్షంగా వేల మంది ఉపాధి పొందుతున్నారని, శ్రీవారివల్లే తిరుపతి ఎంతో అభివృద్ధి చెందుతోందని ఆయన స్పష్టంచేశారు.

### రెండు ఇళ్లలో చోరీ



ధన్వాడ: మండల కేంద్రంలోని రెండు ఇళ్లలో శనివారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని గంజికోట్ల జమున మక్తల్ మండల కేంద్రంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాల కోసం అక్కవారి ఇంటికి వెళ్లింది. ఆదివారం తెల్లవారుజామున మండల కేంద్రానికి వచ్చిన ఆమె ఇంటి తలుపులు తెరిచేందుకు చూడగా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లో ఉన్న రెండు బీరువాలు తెలిరిచి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఇంట్లో ఉంచిన రూ.60 వేల, అర తులం బంగారం చోరీకి గురైనట్లు తెలిపారు. అదే కాలనీలోని రాములమ్మ ఒంటరిగా ఉంటుంది. గత వారం ఇంట్లో పాము రావడంతో రాత్రి సమయంలో ఇంటి పక్కన్న ఉన్నవారి ఇంట్లో నిద్రిస్తుంది. శనివారం రాత్రి దొంగలు ఇల్లు తెరిచి రూ.16 వేలను ఎత్తుకెళ్లారు. సీఐ రాజేందర్, ఎస్ఐ రమేష్, క్లూస్ టీం సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

# ఐసీటీసీల ఎత్తివేతకు రంగం సిద్ధం

- ఉమ్మడి జిల్లాలో నాలుగు కేంద్రాలు
- ఆయా కేంద్రాల్లో ల్యాబ్ టెక్నీషియన్లకు శాంపిల్స్ సేకరణ బాధ్యతలు

జడ్చర్ల టౌన్: ఉమ్మడి జిల్లాలోని ఎయిడ్స్ నిర్ధారణ పరీక్ష కేంద్రాల తొలగింపునకు రంగం సిద్ధమైంది. వివిధ కారణాలు చూపుతూ జడ్చర్ల, కల్వకుర్తి, ఆమన్‌గల్, కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న ఐసీటీసీ (ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్)లను తొలగించేందుకు నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నిర్ణయం తీసుకుంది. ఆయా ఆస్పత్రుల్లో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్లకు శాంపిల్ సేకరణ బాధ్యతలు అప్పగించనున్నారు.

■ ఎయిడ్స్‌ను నియంత్రించాలనే లక్ష్యంతో 1992లో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (న్యాకో) ఆవిర్భవించింది. కేంద్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో న్యాకో పనిచేస్తుంది. రాష్ట్రాల్లో సొసైటీల ద్వారా న్యాకో కార్యకలాపాలు నిర్వహిస్తూ వస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ పనిచేయగా.. ప్రత్యేక రాష్ట్రంలో తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీగా పనిచేస్తుంది. న్యాకో మొదట జిల్లాకేంద్రాల్లో.. తరువాత 30 పడకలు, ఆపై ఉన్న ఆస్పత్రుల్లో ఐసీటీసీ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జడ్చర్ల, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట, షాద్‌నగర్, మక్తల్, కొడంగల్, వనపర్తి, గద్వాల, నారాయణపేట, మహబూబ్‌నగర్, ఏనుగొండ ఎస్వీఎస్ ఆస్పత్రులతో పాటు ఆమన్‌గల్‌లోనూ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఒక్కో కేంద్రంలో ఇద్దరు సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండగా.. ఆయా కేంద్రాల్లో నెలకు కనీసం 300 నుంచి 500 పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**జడ్చర్లలో నెలకు 500 పరీక్షలు..**

జడ్చర్ల ఏరియా ఆస్పత్రిలోని కేంద్రంలో నెలకు 500 వరకు హెచ్ఐవీ పరీక్షలు నిర్వహిస్తున్నారు.





జడ్చర్ల ఏరియా ఆస్పత్రిలోని ఐసీటీసీ ల్యాబ్

**ఎవరెవరికి పరీక్షలు చేస్తారు..**

కేంద్రాల్లో గర్భిణులు, టీబీ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, తరచూ రక్తమార్పిడి చేయించుకునే వారికి ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలు చేస్తారు. గర్భిణికి ఎయిడ్స్ నిర్ధారణ అయితే పుట్టిన శిశువులకు సైతం పరీక్షలు చేస్తున్నారు.

**ఆదేశాలు రాలేదు..**

ఐసీటీసీ ఎత్తివేస్తారని వింటున్నాం. కాని మాకు ఎలాంటి ఆదేశాలు అందలేదు. ప్రస్తుతం ఆస్పత్రిలో కేంద్రం సజావుగానే కొనసాగుతుంది. గర్భిణులు, టీబీ వ్యాధిగ్రస్తులు, అనుమానితులకు నెలకు 500 వరకు పరీక్షలు చేస్తున్నారు. సుమారు రెండు దశాబ్ధాలకు పైగా కేంద్రం కొనసాగుతుంది. – డా. సోమశేఖర్, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, జడ్చర్ల

**న్యాకో నిర్ణయం**

ఉమ్మడి జిల్లాలోని నాలుగు కేంద్రాలు ఎత్తివేయాలని న్యాకో నిర్ణయించింది. జడ్చర్లకు సమీపంలోనే ఎస్వీఎస్, జిల్లా ఆస్పత్రి ఉన్నందున తొలగించాలని సూచిస్తున్నారు. కల్వకుర్తి, ఆమన్‌గల్, కొడంగల్ కేంద్రాల్లో పరీక్షలు తక్కువగా జరుగుతున్నందున తొలగించనున్నారు. ఇందులో తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రమేయం లేదు. – మురళీధర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్

ఇతర కేంద్రాలతో పోలిస్తే ఇక్కడి కేంద్రంలో పరీక్షలు బాగానే జరుగుతున్నా.. సమీపంలోనే ఎస్వీఎస్, జిల్లా ఆస్పత్రి ఉందనే సాకుతో ఎత్తివేసేందుకు న్యాకో నిర్ణయం తీసుకుంది. ఇక ఆమన్‌గల్ కేంద్రంలో కౌన్సిలర్ లేకపోవటంతో పరీక్షలు తక్కువగా జరుగుతున్నాయి. అలాగే కల్వకుర్తి, కొడంగల్ కేంద్రాల్లోనూ నెలవారి పరీక్షలు తక్కువగా నమోదవుతున్నాయి. దీంతో ఆయా కేంద్రాలను ఎత్తివేసేందుకు నిర్ణయించారు.

# ముగిసిన విశ్వశాంతి యాగమహోత్సవం



యాగ మహోత్సవానికి హాజరైన భక్తజనం

జడ్చర్ల టౌన్: పట్టణంలో శ్రీకృష్ణపీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద ఆధ్వర్యంలో 14రోజులుగా నిర్వహిస్తున్న 80వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం ఆదివారంతో ముగిసింది. ఈ మహోత్సవంలో విశేషంగా ఆయుత చండీ అతి రుద్రం చేశారు. ఈనెల 14న గణపతిపూజతో ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం రాత్రి శ్రీరాధాకృష్ణ శాంతి కల్యాణ మహోత్సవంతో ముగిసింది. చివరి రోజున యాగం మహాపూర్ణాహుతి నిర్వహించారు. స్వయంగా కృష్ణజ్యోతి స్వరూపానంద, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పూర్ణాహుతి సామగ్రిని తలపై పెట్టుకుని ఊరేగింపుగా యాగశాలకు తీసుకువచ్చారు. ఇరువురు వేర్వేరుగా యాగశాలలో పూర్ణాహుతి సమర్పించారు. పూర్ణాహుతి తర్వాత గురుపూజ, అవబృదస్నానం, శ్రీకృష్ణ ఉట్టి కొట్టుట చేశారు. సాయంత్రం శ్రీరాధాకృష్ణ శాంతి మహోత్సవం చేయడంతో ఉత్సవాలు ముగిశాయి.



పూర్ణాహుతి సమర్పిస్తున్న కృష్ణజ్యోతి స్వరూపానంద



పూర్ణాహుతి తీసుకువస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

# కార్యకర్తల అభీష్టం మేరకే నిర్ణయం



మాట్లాడుతున్న సీతాదయాకర్‌రెడ్డి

- కార్యకర్తలు, అభిమానులతో సీతాదయాకర్‌రెడ్డి సమావేశం

చిన్నచింతకుంట: మాజీ ఎమ్మెల్యే కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. అందుకు చిన్నచింతకుంట మండలం పర్కాపురంలోని తన నివాసంలో ఆదివారం అభిమానులు, కార్యకర్తలతో అభిప్రాయ సేకరణపై సమావేశం నిర్వహించారు. ఏపార్టీలో చేరితే బాగుంటుందని కార్యకర్తలతో చర్చించారు. కాంగ్రెస్‌లో చేరాలని అధిక సంఖ్యలో అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యకర్తలు, అభిమానులే నాబలమని వారి అభిప్రాయం మేరకు పార్టీ చేరికపై రెండు రోజులలో స్పష్టత ఇస్తానని చెప్పారు.

**మక్తల్ పైనే ఫోకస్..**

దేవరకద్ర నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట సీతాదయాకర్ రెడ్డి ఈ సారి ఎన్నికల బరిలో తన భర్త దివంగత మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి ప్రాతినిథ్యం వహించిన మక్తల్ నియోజకవర్గం నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి కార్యారణ సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. దయాకర్‌రెడ్డికి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అత్యంత సన్నిహితుడు కావడంతో కాంగ్రెస్ పార్టీ నుంచే పోటీ చేయాలన్న దృఢ సంకల్పంతో ఆమె ఉన్నారు. ఎట్టకేలకు కార్యకర్తల అభీష్టం కూడా కాంగ్రెస్‌లోకి రావాలని పట్టుబట్టడంతో త్వరలోనే నిర్ణయం వెల్లడిస్తానని ఆమె కార్యకర్తలకు భరోసా ఇవ్వడం చర్చనీయాంశమైంది.

# ‘జైపాల్‌యాదవ్’కు సహకరించం



అభివాదం చేస్తున్న నాయకులు

- ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా కడ్తాల్‌లో సమావేశం
- పునరాలోచించాలని అధిష్టానానికి వినతి

కడ్తాల్: బీఆర్ఎస్ కల్వకుర్తి టికెట్‌ను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు ఇస్తే ఎట్టి పరిస్థితిలోనూ సహకరించేది లేదని పలువురు బీఆర్ఎస్ నాయకులు తేల్చిచెప్పారు. ఆదివారం స్థానిక ఓ ఫంక్షన్‌హాల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ తదితరులు మాట్లాడుతూ.. ‘సిట్టింగ్‌లకే టికెట్లు’ ప్రాతిపదికన ఎమ్మెల్యే పేరును ప్రకటించిన అధిష్టానం ఈ విషయంపై పునరాలోచించాలని కోరారు. ఎమ్మెల్యే నియోజకవర్గానికి చేసిందేమీ లేదని మండిపడ్డారు. కార్యకర్తలు, నాయకులు ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరిచే పరిస్థితి లేదని తెలిపారు.

**కసిరెడ్డికి అవకాశం ఇవ్వండి..**

నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అహర్నిషలు కృషిచేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి టికెట్ ఇవ్వాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. ఆయనకు అవకాశం ఇస్తే భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. బీసీ నేతకే ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తే, ఉద్యమ నాయకుడు, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్‌కు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఇప్పటికే చాలా మంది నాయకులు గళం విప్పుతున్నారని, రానున్న రోజుల్లో ఇది మరింత తీవ్రమవుతుందన్నారు. జైపాల్‌యాదవ్ వ్యతిరేక వర్గీయులు ముమ్మందు తలకొండపల్లి, వెల్దండ, ఆమనగల్లు, కల్వకుర్తి మండలాల్లోనూ సమావేశాలు ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. పరిస్థితి మరింత ముదరక ముందే అధిష్టానం సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. 400 మందికి పైగా హాజరైన కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, భాస్కర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, వేణుగోపాల్, శేఖర్‌గౌడ్, శ్రీనివాస్, జహంగీర్‌అలీ పాల్గొన్నారు.

# రంజీ స్థాయికి ఎదగాలి

- ఎండీసీఏ చీఫ్ ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి
- ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా క్రికెట్ క్రీడాకారుల ఎంపిక
- 300మందికిపైగా హాజరు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా క్రికెట్ క్రీడాకారుల్లో మంచి ప్రతిభ ఉందని, క్రీడాకారులు రంజీస్థాయికి ఎదగాలని మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్, ప్రముఖ న్యాయవాది మనోహర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం పిల్లలమర్రి సమీపంలోని ఎండీసీఏ క్రికెట్ మైదానంలో ఆదివారం ఎండీసీఏ లీగ్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి 300 మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారు. వారు ఎండీసీఏ లీగ్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని ప్రతిభచాటాలని కోరారు. నిరంతరం ప్రాక్టీస్‌తోనే క్రీడల్లో విజయం సాధించవచ్చని వారు సూచించారు. ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ లీగ్‌లో పాల్గొనే 8 జట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. వచ్చే శని, ఆదివారాల్లో ఎండీసీఏ లీగ్‌ను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. 25 ఓవర్ల లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తామని తెలిపారు. లీగ్‌లో ప్రతిభకనబరిచే క్రీడాకారులను రాబోయే ఇంటర్ డిస్ట్రిక్ లీగ్, హైదరాబాద్‌లో నిర్వహించే స్కూల్ లీగ్‌కు ఎంపిక చేస్తామని తెలిపారు. అంతకుముందు క్రీడాకారుల బ్యాటింగ్, బౌలింగ్ అంశాల్లో ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఉపాధ్యక్షుడు వెంకటరామారావు, సురేష్‌కుమార్, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా, సభ్యుడు కృష్ణమూర్తి, సీనియర్ క్రీడాకారులు మహేష్, ఆబిద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీఫ్ ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి